క్లుప్తంగా

కలెక్టర్ అభినందన


కల్యాణ్ దంపతులను అభినందిస్తున్న కలెక్టర్

సూపర్‌బజార్(కొత్తగూడెం): గేయ రచయితలు కళ్యాణ్ – సుమిత్ర కొంతకాలంగా 250కి పైగా పాటలు రచించి సౌత్ ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్నారు. ఈ సందర్భంగా వీరు శుక్రవారం కలెక్టర్ జితేష్ వి.పాటిల్‌ను కలవగా అభినందించారు.

టాలెంట్ టెస్టుతో సృజనాత్మకత

ఇల్లెందు: సృజనాత్మకతకు పదును పెట్టేలా టాలెంట్ టెస్టు ఉపయోగపడుతుందని సీపీఐ రాష్ట్ర నాయకుడు కె.సారయ్య అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని సీపీఐ విఠల్‌రావు భవన్‌లో టాలెంట్ టెస్టులో విజేతలకు బహుమతులు అందజేశారు. 360 మంది విద్యార్థులు టాలెంట్ టెస్ట్‌కు హాజరు కాగా పది మంది విద్యార్థులను ఎంపిక చేసి వారికి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా విజేతలకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రవికిరణ్, సత్యేంద్ర కుమార్, డి.శంకర్, బంధం నాగయ్య, బాస శ్రీనివాసరావు, పుల్లూరి సతీష్, జొన్నల ఉపేందర్, నాగరాజు, వ్యామసాని జనార్దన్, తాటిపల్లి సుబ్బారావు, గౌరిశెట్టి కృష్ణ, భాస్కర్ పాల్గొన్నారు.

ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ సమావేశం

ఇల్లెందు: ఇల్లెందు, కారేపల్లి మండలాల ఫ్లెక్సీ ప్రింటర్స్ అసోసియేషన్ సమావేశం శుక్రవారం ఇల్లెందులో జరిగింది. అసోసియేషన్ అధ్యక్షుడు నాథ్, ఉపాధ్యక్షుడు రాజు, వెంకట్ మాట్లాడుతూ... ఈ రంగంలో పని చేస్తున్న వారికి అనేక సమస్యలు ఉన్నాయన్నారు. ముడి సరుకు రేట్లు, జీఎస్టీ పెరగటం వల్ల ఫ్లెక్సీ ధరలు పెరిగాయన్నారు. ఈ విషయంపై ఫ్లెక్సీ ప్రింటింగ్ యజమానులు శని, ఆదివారం బంద్ పాటించి తమ నిరసన వ్యక్తం చేయాలని కోరారు. వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని పేర్కొన్నారు.

నిలిచిన బొగ్గు లారీలు

టేకులపల్లి: దాసుతండా వద్ద ప్రధాన రహదారిని తవ్వి, కంకర పోశారు. తారు వేయాల్సి ఉంది. నెలల తరబడి రేపుమాపు అంటూ రోడ్డు వేయకుండా అధికారులు నిర్లక్ష్యం చేస్తుండటంతో కేటీసీ నుంచి వివిధ ప్రాంతాలకు బొగ్గులోడుతో వెళ్లే వాహనాల వల్ల వచ్చే దుమ్ముధూళితో స్థానికులు అనారోగ్యం పాలవుతున్నారు. ఇప్పటికే పలుమార్లు నిరసనలు, రాస్తారోకో చేశారు. అయినా అధికారుల్లో చలనం రాలేదు. కొద్దిరోజులు రోడ్డుపై నీటిని స్ప్రే చేసి నిలిపివేశారు. దీంతో శుక్రవారం బాధితులు మరోసారి రోడ్డుపై కర్రలను ఉంచి బొగ్గు లారీలను రోడ్డు నిలిపి నిరసన తెలియజేశారు. అదే సమయంలో కేటీసీ అధికారులు అటువైపు రావడంతో ఆ వాహనాన్ని ఆపి రోడ్డు సమస్యను తెలియజేశారు. ప్రతీరోజు నీటిని స్ప్రే చేయించాలని కోరడంతో స్పందించిన అధికారులు వెంటనే సంబంధిత బాధ్యులతో మాట్లాడి వాటర్ ట్యాంకర్‌ను తెప్పించడంతో ఆందోళన విరమించారు.

ఉపాధి పథకం.. ప్రత్యక్ష ప్రయోజనం

ఉపాధి హామీ పథకం ద్వారా కూలీలకు పనులు చూపించడంతో ప్రత్యక్షంగా ప్రజలకు ప్రయోజనం చేకూర్చేలా ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఉన్నతాధికారులు ప్రత్యేక ప్రణాళిక రూపొందించారు. సాధారణ పనులకు ఆటంకం కలగకుండా ఐదు నెలల ప్రణాళికతో అధికారులు ప్రత్యేక కార్యచరణను సిద్ధం చేశారు. ఇందులో భాగంగా వ్యవసాయాభివృద్ధి, మహిళలకు చేయూతనిచ్చే పనులతోపాటు సాధారణ అభివృద్ధి పనుల లక్ష్యంగా ప్రతిపాదనలు స్వీకరించారు. మార్చి చివరి నాటికి పనులు పూర్తి చేసి మంజూరైన నిధులను సద్వినియోగం చేసుకునేలా లబ్ధిదారులు సిద్ధమయ్యారు.

- రూ.2కోట్ల వ్యయంతో ఐదు నెలల ప్రణాళిక
- గ్రామాలలో వేగంగా సాగుతున్న పనులు
- మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని నిబంధన

ఇల్లెందురూరల్: మండలంలోని 29 గ్రామపంచాయతీల పరిధిలో ఉపాధి హామీ పథకం ద్వారా ప్రజలకు ప్రత్యక్ష ప్రయోజనం చేకూరేలా ప్రభుత్వం రూ.2కోట్ల నిధులను మంజూరు చేసింది. ఆయా నిధులలో వ్యవసాయాభివృద్ధి, మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి 60శాతం, సీసీ రహదారులు, అంగన్‌వాడీ పాఠశాలలు, గ్రామపంచాయతీ భవనాలు, చెక్‌డ్యాంలు, పారిశుద్ధ్య పనులు తదితర వాటికి 40 శాతం నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ నిబంధనలకు లోబడి ఎన్‌ఆర్ ఈజీఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు ప్రతిపాదనలు రూపొందించి అనుమతి పొందారు. వ్యవయాసాభివృద్ధిలో భాగంగా పంట చేలకు రహదారులు, భూమి చదును, కాలువలు, పండ్ల తోటల పెంపకం, ఫారంపాండ్, ఇంకుడు గుంతల నిర్మాణం, మహిళల ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా పశువుల పాకలు, కోళ్ల షెడ్లు, వర్మీ కంపోస్టు తయారీ వంటి పనులు చేయడానికి ప్రణాళిక రూపొందించారు. అంతేకాకుండా గ్రామాలలో సీసీ రహదారులు, కాలువలు వంటి నిర్మాణాలను కూడా ఐదు నెలల ప్రణాళికలో పొందుపర్చారు.


రేపల్లెవాడలో నిర్మాణ దశలో ఉన్న ఫారంపాండ్

వేగంగా సాగుతున్న పనులు..

మండలంలో ఐదు నెలల ప్రణాళికలో భాగంగా నిధులను సద్వినియోగం చేసుకునే లక్ష్యంతో అధికారులు పనులను వేగవంతంగా చేపడుతున్నారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ పథకంలో భాగంగా మహిళల కోసం క్యాటిల్ షెడ్లు ఒక్కొటి రూ.85వేలు వ్యయంతో ఎనిమిదింటిని, కొమ్ముగూడెం గ్రామంలో పౌల్ట్రీ షెడ్డు నిర్మాణం కోసం రూ.3లక్షల నిధులు, వ్యవసాయాభివృద్ధి లక్ష్యంగా రూ.7లక్షలు, పట్టా, పోడు భూముల అభివృద్ధి లక్ష్యంగా 15 పనుల కోసం రూ.45లక్షలు, మామిడి, మునగ, కొబ్బరి వంటి ఉద్యాన పంటలను ఐదెకరాల విస్తీర్ణంలో సాగు చేసేందుకు రూ.2.50 లక్షలు, మూడు ఫారంపాండ్‌ల నిర్మాణం కోసం రూ.2.70 లక్షలు, హరితహారం పథకంలో భాగంగా నర్సరీ, మొక్కల నిర్వహణ కోసం రూ.7.50 లక్షలు, 10 ఇంకుడు గుంతల నిర్మాణం కోసం రూ.64 వేలు, పంచాయతీరాజ్ విభాగం ద్వారా సీసీ రోడ్ల నిర్మాణం కోసం రూ.37 లక్షల నిధులను మంజూరు చేశారు. వీటిలో ఇప్పటి వరకు రూ.25లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణం పూర్తవగా ఇంకా రూ.12లక్షల వ్యయంతో పనులు చేపట్టాల్సి ఉంది. మిగతా పనులు సైతం నిర్మాణ దశలో ఉన్నాయి. మార్చి 31 నాటికి నూరు శాతం పనులు పూర్తి చేసేలా ఎన్‌ఆర్‌ఈజీఎస్, పంచాయతీరాజ్ శాఖల అధికారులు లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నారు.


రేపల్లెవాడలో క్యాటిల్ షెడ్


కొమ్ముగూడెంలో నిర్మిస్తున్న పౌల్ట్రీ షెడ్

జాబ్‌కార్డు జారీ నిలిపివేతతో ఆందోళన...

ఆరు గ్యారంటీలలో భాగంగా ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన ఆత్మీయ భరోసా పథకంతో ఉపాధి పనులకు డిమాండ్ పెరిగింది. సెంటు భూమి లేని ఉపాధి హామీ పథకం కూలీలు 20 రోజుల పాటు ఉపాధి పనులకు వెళ్తే ఆత్మీయ భరోసా పథకం వర్తింపజేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంతో జాబ్‌కార్డు ఉన్నవారిలో భూమి లేని నిరుపేదలు ఉపాధి పనులకు క్యూ కడుతున్నారు. ఇదిలా ఉండగా తాజా పరిణామంతో ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు కోసం భూమి లేని నిరుపేదల నుంచి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. దీంతో అప్రమత్తమైన ఉన్నతాధికారులు తాత్కాలికంగా జాబ్‌కార్డుల జారీని నిలిపివేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పరిణామం అటు కొత్తగా పనులకు వెళ్లే కూలీలతోపాటు తాజాగా ఐదు నెలల ప్రణాళికలో భాగంగా మంజూరైన పనులను సద్వినియోగం చేసుకోవడంలోనూ జాబ్‌కార్డులు లేక మహిళలు ఇబ్బంది పడుతున్నారు.

రూ.2కోట్లు మంజూరయ్యాయి...



ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి ఐదు నెలల ప్రణాళికలో భాగంగా మండలానికి ఎన్‌ఆర్ ఈజీఎస్, పంచాయతీరాజ్ శాఖలకు రూ.2కోట్ల నిధులు మంజూరయ్యాయి. ప్రభుత్వం రూపొందించిన నిబంధనలకు అనుగుణంగా ప్రతిపాదనలు సిద్ధం చేసి ఆమోదం పొందాం. మార్చి చివరి నాటికి నిర్దేశించుకున్న పనులు పూర్తి చేసేందుకు లబ్ధిదారులను ప్రోత్సహిస్తున్నాం.

– శంకర్, ఏపీఓ, ఎన్‌ఆర్‌ఈజీఎస్, ఇల్లెందు

డయల్ యువర్ డీఎంకు స్పందన

చుంచుపల్లి: కొత్తగూడెం ఆర్టీసీ డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ శుక్రవారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించారు. ప్రయాణికుల నుంచి విశేష స్పందన లభించింది. వాటిలో కొన్ని ఇల్లెందు నుంచి మాణిక్యారానికి బస్సు నడపాలని, వీఎం బంజర నుంచి హైదరాబాద్‌కు రెగ్యులర్‌గా బస్సు నడపాలని కోరారు. అదేవిధంగా అశ్వారావుపేటకు కండీషన్‌లో ఉన్న కొత్త బస్సును ఏర్పాటు చేయాలని, చంద్రుగొండ బస్టాప్ వద్ద అన్ని సర్వీసులను నిలపాలని ప్రయాణికులు కోరారు.

ఘనంగా టైలర్స్ డే

జూలూరుపాడు: మండల కేంద్రంలో శుక్రవారం టైలర్స్ డేను టైలర్లు ఘనంగా జరుపుకున్నారు. సీనియర్ టైలర్స్ షేక్ జానిమియా, బాపట్ల పూర్ణచందర్‌రావు కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో యనమనగండ్ల కోటేశ్వరరావు, ఎదులాపురం నాగుల్‌మీరా, కాకటి గోపీ, కనపర్తి రామయ్య, కల్లోజి లింగయ్య, ఎస్కే సిద్దిక్, నరసింహారావు, తోట కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బీమాను సద్వినియోగం చేసుకోండి..

టేకులపల్లి: సంవత్సరానికి రూ.436 చెల్లింపుతో పోస్టల్ శాఖలో కొనసాగుతున్న ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి బీమా పథకం (పీఎంజేజేబీవై)ను అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోస్ట్ ఇల్లెందు చిన యాకయ్య అన్నారు. బేతంపూడి గ్రామానికి చెందిన మెడ రమేష్ పీఎంజేజేబీవై పథకంలో ప్రతీ సంవత్సరం రూ.436 చెల్లిస్తూ వచ్చాడు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ మేరకు మృతుడి భార్య విజయకు బీమా నగదు రూ.2 లక్షలను శుక్రవారం బేతంపూడి గ్రామంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. తపాలా శాఖలో చాలా తక్కువ ప్రీమియంతో ఎక్కువ మొత్తంలో బీమా ఇన్సూరెన్స్, పొదుపు పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో బేతంపూడి బీపీఎం గుడిమెట్ల శ్రీను, ఏబీపీఎం శరణ్య, స్థానికులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో శ్రమదానం

టేకులపల్లి: కొప్పురాయి గ్రామ పంచాయితీ ఒడ్డుగూడెం గ్రామంలోని అంగన్‌వాడీ మరియు ప్రైమరీ పాఠశాలలో యువజన నాయకులు భూక్యా వెంకటేష్, చింత కళ్యాణ్ శుక్రవారం శ్రమదానం నిర్వహించారు. పరిసరాలను పరిశుభ్రం చేసి, మొక్కలకు నీరు పోశారు. మాట్లాడుతూ... పాఠశాల అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని తెలిపారు. విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. ఉపాధ్యాయులు గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ ఉండాలి


ఇల్లెందు: మాట్లాడుతున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు


చుంచుపల్లి: నృత్యం చేస్తున్న చిన్నారులు

ఇల్లెందు: విద్యార్థులకు ఆత్మవిశ్వాసం, క్రమశిక్షణ అవసరం అని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రామలింగేశ్వరరావు అన్నారు. శుక్రవారం శ్రీ చైతన్య జూనియర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విద్యార్థుల వీడ్కోలు సభలో ఆయన మాట్లాడారు. నిరంతర జ్ఞాన సముపార్జన ద్వారా ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని తెలిపారు. మైనార్టీ కళాశాల ప్రిన్సిపాల్ ముద్దసిర్ హుస్సేన్, చైర్మన్, డైరెక్టర్ జి.అప్పారావు, పి.హేమలత, కె.వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చుంచుపల్లి: ప్రస్తుతం విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యాబోధన అందించాలని వైద్య నిపుణులు డాక్టర్ హేమంత్ కుమార్ అన్నారు. కొత్తగూడెంలోని కిడ్స్ పార్క్ టాలెంట్ స్కూల్ వార్షికోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. పోటీ ప్రపంచంలో పిల్లలు మానసిక ఒత్తిడికి గురికాకుండా ఆటపాటలతో కూడిన విద్యనందిస్తే మంచి ఫలితాలు వస్తాయన్నారు. విద్యార్థుల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. వివిధ రంగాల ప్రముఖులు విజయరెడ్డి, డాక్టర్ అల్లూరి నాగరాజుతో పాటు స్కూల్ కరస్పాండెంట్ రామిశెట్టి వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ మౌనిప్రియ, బండి లక్ష్మణ్, బసవేశ్వరరావు, రామిశెట్టి శ్రీనివాసరావు, రత్నప్రసాద్, కళ్యాణి దుర్గ, నాగేందర్, అల్లి శంకర్ పాల్గొన్నారు.

ఏరియాలో 80శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి కొత్తగూడెం ఏరియాలో ఫిబ్రవరిలో 14,75,355 టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యానికి గాను 11,80,178 టన్నులు (80శాతం) ఉత్పత్తి నమోదైంది. ఈ ఆర్థిక సంవత్సరం 11నెలల్లో 1,31,20,355 టన్నుల గాను 1,26,14,845 టన్నుల (96శాతం) ఉత్పత్తి నమోదైందని శుక్రవారం అధికారులు వెల్లడించారు. గతేడాది ఇదే సమయానికి 1,23,61,992 టన్నుల ఉత్పత్తి చేయగా, ఈసారి సుమారు 3లక్షల టన్నుల ఉత్పత్తి పెరిగిందని తెలిపారు.

మరమ్మతుల భారం.. వెలగని వీధి లైట్లు


కొమరారం పీహెచ్‌సీలో కిందకు వేలాడుతున్న సోలార్ లైట్

ఇల్లెందురూరల్: విద్యుత్ బిల్లుల భారం తగ్గించుకునే లక్ష్యంతో ప్రభుత్వం పీహెచ్‌సీలలో సోలార్ వీధి దీపాలను మంజూరు చేసింది. ఐదేళ్ల క్రితం వీటిని కొమరారం, రొంపేడు పీహెచ్‌సీలలో అమర్చారు. ప్రారంభంలో వెలుగులు అందించిన వీధి దీపాలు నిర్వహణ లేక మూలన పడ్డాయి. దీంతో పక్షుల గూళ్లకు ఆసరా అయ్యాయి. స్తంభాలకు అమర్చిన వీధి దీపాలు కొన్నిచోట్ల మాయమవగా మరికొన్ని చోట్ల కిందకు వేలాడుతున్నాయి. పీహెచ్‌సీలకు మంజూరయ్యే నిధులు ఆస్పత్రి నిర్వహణ, మందుల ఖర్చుకే సరిపోతున్నాయని, నిధులు లేక సోలార్ వీధి దీపాల మరమ్మతులపై దృష్టి సారించలేదని వైద్యాధికారులు చెపుతున్నారు. ప్రత్యామ్నాయంగా ట్యూబ్‌లైట్లు అమర్చాలని గ్రామపంచాయతీలను కోరినట్లు పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఏజెన్సీ గ్రామాలు కేంద్రంగా 24గంటల పనిచేసే కొమరారం పీహెచ్‌సీ ప్రధాన రహదారికి 50మీటర్ల దూరంలో ఉంటుంది. రాత్రి వేళలో వీధిదీపాలు లేక ఆస్పత్రికి వెళ్లేదుకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారని, వైద్యాధికారులు స్పందించి వెంటనే వీధిదీపాలు ఏర్పాటు చేయాలని ఏజెన్సీ ప్రజలు కోరుతున్నారు.

డిజిగ్నేషన్ మార్చండి..

సింగరేణి(కొత్తగూడెం): కోలిండియాలో జనరల్ మజ్దూర్లను జనరల్ అసిస్టెంట్లుగా మార్పు చేస్తూ శుక్రవారం కోలిండియా యాజమాన్యం ఉత్తర్వులు జారీ చేసింది. జేబీసీసీఐ 4వ ప్రైషల్ మెన్ (గుజరాత్‌లో జరిగిన) స్టాండరైజేషన్ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన చర్చల్లో హెచ్ఎంఎస్ నాయకులు సింగరేణిలో జనరల్ మజ్దూర్ డిజిగ్నేషన్‌ను మార్చాలని కోలిండియా యాజమాన్యాన్ని కోరిన నేపథ్యంలో మార్పు చేస్తూ సంస్థ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భంగా రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ.. స్టాండరైజేషన్ కమిటీ సూచన మేరకు సింగరేణిలో కూడా డిజిగ్నేషన్ స్టేటస్‌ను జనరల్ అసిస్టెంట్‌గా మార్చాలని డిమాండ్ చేశారు.

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి


ప్రశంసా పత్రం అందజేస్తున్న డాక్టర్ యుగంధర్‌రెడ్డి

పాల్వంచరూరల్: విద్యార్థినులు చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని, ప్రతిభ కలిగిన క్రీడాకారులకు ప్రత్యేకంగా కోచింగ్ ఇప్పించి రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామని జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ గంగిరెడ్డి యుగంధర్‌రెడ్డి అన్నారు. స్థానిక సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ క్రీడా పోటీలు శుక్రవారం ముగిశాయి. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, అథ్లెటిక్స్ పోటీలో విజయం సాధించిన క్రీడాకారులతో ప్రశంస, ధృవీకరణ పత్రాలతోపాటు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు వై.వెంకటేశ్వర్లు, ప్రిన్సిపాల్ ఝాన్సీరాణి, స్వరూపరాణి, వైస్ ప్రిన్సిపాల్ జస్విత పాల్గొన్నారు.

వాల్‌పోస్టర్లు ఆవిష్కరణ

జూలూరుపాడు: ఈనెల 10న జూలూరుపాడులో ప్రారంభం కానున్న రెడ్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నీ వాల్‌పోస్టర్లు, కరపత్రాలను కబడ్డీ అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు లేళ్ల వెంకటరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలోత్ మంగిలాల్ నాయక్ శుక్రవారం జూలూరుపాడులో ఆవిష్కరించారు. వెంకటరెడ్డి మాట్లాడుతూ... గ్రామీణ ప్రాంత క్రీడాకారులల్లోని నైపుణ్యాలను వెలికితీసేందుకు నిర్వహించే క్రికెట్ టోర్నీని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వేల్పుల నరసింహారావు, కొదుమూరి కోటేశ్వరరావు, భూక్యా అమ్ము, బానోత్ రాంజీ, బానోత్ నవీన్ రాథోడ్, సుందర్‌రావు, యోహాన్, దినేష్, ఎస్కే షఫీ, శరత్, హరీష్, అజయ్ పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

‘కార్పొరేట్‌కు మేలు చేసిన కేంద్ర బడ్జెట్’


మాట్లాడుతున్న రమేష్

ఇల్లెందు: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకే మేలు చేసేవిధంగా ఉందని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఏజే రమేష్ అన్నారు. శుక్రవారం ఇల్లెందులోని ఏలూరి భవన్‌లో ప్రజా సంఘాల సమావేశంలో ఆయన మాట్లాడారు. మోదీ దృష్టిలో కేంద్రం ప్రభుత్వ అంటే అదానీ, అంబానీగా మారిపోయిందన్నారు. కూలి చేసుకుని పొట్ట నింపుకున్న పేదలకు ఎలాంటి ఉపయోగం లేకుండా పోయిందన్నారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ అంకెల గారడీతో పేదప్రజలకు తీరని అన్యాయం చేశారని విమర్శించారు. సామాజిక భద్రత చట్టాలు అమలు చేయాలని ఆందోళనలు చేస్తుంటే బడ్జెట్‌లో నిధులు కేటాయింపు చేయలేదన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం, రైతు సంఘం నాయకులు అబ్దుల్ నబీ, ఆలేటి కిరణ్, కృష్ణ, వెంకటమ్మ, ఫాతిమా, సుల్తానా, బయ్యా అభిమన్యు, మోహన్‌రావు, నాగరాజు, మరియా, రాంబాయి, ఆలేటి సంధ్య తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్



కళ తప్పిన పల్లె ప్రకృతి వనాలు..


గోలియాతండాలో...


లచ్చగూడెంలో...

తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటు చేసిన పల్లె ప్రకృతి వనాల్లో ఆహ్లాదం దేవుడెరుగు... అధ్వానంగా మారాయి. ప్రకృతి వనంలో పచ్చదనం, నీడనిచ్చే మొక్కలు, కూర్చునేందుకు బల్లలు, వాకింగ్ ట్రాక్, పిల్లలు ఆడుకునేందుకు ఆట వస్తువులు ఉండాలి. ఇవేవీ లేవు. గోలియాతండా పంచాయతీ పరిధి ప్రభుత్వ జూనియర్ కాలేజీ సమీపంలో రెండు పల్లె ప్రకృతి వనాలు ఏర్పాటు చేశారు. ఇందులో నాటిన మొక్కలు మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయాయి. ఫెన్సింగ్ లేదు.. నిర్వహణ లేదు. దీంతో కళావిహీనంగా మారాయి. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - టేకులపల్లి

ప్రశ్నించాల్సిన అధికారి: జేఎల్ గాంధీ, ఎంపీఓ, టేకులపల్లి
సెల్ నంబర్: 9948169879

స్వతంత్రంగా ఆలోచించే తత్వమే విజ్ఞానశాస్త్రం


ఇల్లెందు: మాంటిస్సోరి స్కూల్‌లో..


జూలూరుపాడు: ప్రయోగాన్ని వివరిస్తున్న విద్యార్థులు


ఇల్లెందు: మార్గదర్శిని స్కూల్‌లో సైన్స్‌ఫేర్‌ను పరిశీలిస్తున్న డైరెక్టర్ డీవీ


పాల్వంచ: శ్రీవిద్య పాఠశాలలో...

పలు ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో భౌతిక శాస్త్రవేత్త సీవీ రామన్ జయంతిని శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవంగా జరుపుకున్నారు. విద్యార్థులు పలురకాలు ప్రయోగాలను ప్రదర్శించారు. క్విజ్, వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా పాఠశాలలు, కళాశాలల ప్రిన్సిపాళ్లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు పాల్గొని విద్యార్థుల ప్రతిభను అభినందించారు. పలువురు మాట్లాడుతూ... స్వతంత్రంగా ఆలోచించే తత్వమే విజ్ఞాన శాస్త్రమని సీవీ రామన్ ఇచ్చిన సందేశం నేటితరానికి స్ఫూర్తి అన్నారు. నేడు సైన్స్‌లో పరిశోధనలు రామన్ ఎఫెక్ట్ ఫలితమే ప్రధాన కారణమని, సైన్స్‌తో సృజనాత్మకత ఆలోచనలు తోడైతే గొప్ప ఆవిష్కరణలు సాధ్యమవుతాయన్నారు. భారత సైన్స్ రంగానికి రామన్ చేసిన సేవలను కొనియాడారు.

– సాక్షి నెట్‌వర్క్


పాల్వంచ: కేఎల్‌ఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ప్రదర్శనలు పరిశీలిస్తున్న కేటీపీఎస్ సీఈ


కొత్తగూడెంఅర్బన్: మోడ్రన్ ఇఖ్రా స్కూల్‌లో..


కొత్తగూడెంఅర్బన్: మానస వికాస్ పాఠశాలలో..


టేకులపల్లి గ్రావిటీ స్కూల్‌లో..


టేకులపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..


సూపర్‌బజార్(కొత్తగూడెం): సింగరేణి మహిళా డిగ్రీ కళాశాలలో.. సీవీ రామన్‌కు నివాళి